# సౌండ్ స్లీప్




- విశ్వనాథ పావని శాస్త్రి

ఉదయ సంధ్యని ఉత్తమ నటిగా తీర్చి దిద్దినవాడు సాయ్‌కాల నాథ్! ఉత్తమ దర్శకుడైన అతనికి తన మనసునేనాడో అర్పించేసిందామె! నాథ్ దగ్గరున్న ఆ మనసు, అస్కాంతంలాగా ఆమె శరీరాన్ని కూడా అటు లాగసాగింది.

కాని చిక్కెక్కడంటే- నాథ్‌కి ఏకపత్నీవ్రతుడుగా ఫీల్డ్‌లో గొప్ప పేరు. ఏ హీరోయిన్ని కదిలించినా, బాబోయ్ అంటూ గుడ్లు పెద్దవి చేసి, గుండెల మీద చేతులేసి, 'గౌతమ బుద్ధుడు' అంటూ కాంప్లిమెంటిచ్చేస్తుంది. ఆ కాంప్లిమెంట్లు విన్న కొద్దీ సంధ్యకి 'కాంపిటేటివ్ స్పిరిట్' పెరిగిపోసాగింది.

మత్తు చూపుల్తో, కొంటె మాటల్తో, ఒళ్ళు విరువుల్తో కళ్ళ కలుపుల్తో, దాన్తో దీన్తో ఎన్తో ఎన్తో రెచ్చగొట్టేది. నాథ్ ప్రతిదానికీ క్యాజువల్‌గా నవ్వి ఊరుకునేవాడు. దాంతో ఆమె మరీ రెచ్చిపోయేది. ఎవరూ చూడకుండా చూసి గిచ్చిపోయేది. అంతకన్నా ఏం చేస్తుంది? "వనిత తనంత తానలచి వచ్చిన చుల్కన కాదె-?" అయినా మాంచి ఏకాంతం కోసం ఎదురు చూస్తూనే వుంది.

ఈసారి డ్రీమ్ సాంగ్ డార్జిలింగ్‌లో చెయ్యాలని ప్రొడ్యూసర్ మహా ఉత్సాహంగా వున్నాడు. ఔట్ డోర్లు గిట్టని నాథ్‌కి తప్పలేదు. మొత్తం ఐదు రోజులు క్యాంప్!

మూడు రోజులయ్యేటప్పటికి మూడ్ మారిపోయింది నాథ్‌కి! కళ్ళు బాగా ఎర్రబడ్డాయి. రాత్రిళ్ళు నిద్రపోవడం లేదని స్పష్టంగా తెలుస్తోంది.

నాల్గో రోజున లంచ్ బ్రేక్‌లో మంచ్ చేస్తూ మంచిగా కుర్చీ అంచున చేరి అడిగింది సంధ్య, "ఏం గురూజీ? డల్‌గా వున్నారు?"

కాస్సేపు మాట్లాడలేదు నాథ్. మళ్ళీ కదిపింది.

అదోలా చూస్తూ అన్నాడు నాథ్, "ఏమిటోనోయ్! రాత్రిళ్ళు నిద్ర పట్టడం లేదు."

సంధ్య మొహంలో మోహం మొలకెత్తింది. "ఏం?" అని ఆత్రంగా అడిగింది.

అప్పుడం నములుతున్న నాథ్ నీళ్ళు నమలసాగాడు.

"అంతే లెండి! నాతో ఎందుకు చెప్తారు? నేనేం కట్టుకున్న భార్యనా?" అంది చురుగ్గా చూస్తూ.

"ఛ!ఛ! అదేం లేదోయ్" అన్నాడు ఆ కళ్ళల్లోకి ఇరుగ్గా చూస్తూ.

"మరైతే ఏమిటో చెప్పండి" అంది అరకూల్‌గా.

అటూ యిటూ చూసి "మా ఆవిడ పక్కన లేకపోతే నాకు నిద్రపట్టదోయ్" అనేశాడు.

సంధ్య కళ్ళు మెరిశాయి. "పోనీ! నేనొచ్చి జోల పాడనా రాత్రికి?" అంది.

ఆ మాటకి ఆమె కళ్ళల్లోకి వెతుకుతూ చూశాడు నాథ్. క్యాజువల్‌గా వుండే కళ్ళలో ఏదో ఆహ్వానం కనబడింది సంధ్యకి.

మొలకెత్తిన మొక్క మారాకు వేసింది. 'అమ్మ ఏకపత్నీవ్రతుడా!-' అని పులకించిపోయింది. 'ఎన్నాళ్ళికి దొరికావు నవనీత చోరుడా-' అని వికసించిపోయింది. 'వుండు నీ పని చెప్తా-' అని విచలించిపోయింది.

ఆరోజు సంధ్య పెర్‌ఫార్‌మెన్సు ఎక్సెలెంట్స్! హీరో "మధ్యందిన మార్తాండ" మొదలూ చివరా అందక మామిడి తాండ్రలాగ జారిపోయాడు.

ఆరోజు రాత్రి పదకొండు గంటలు! డార్జిలింగ్ లాడ్జింగ్! యూనిట్ అంతా ఎక్కడివాళ్ళు అక్కడ రకరకాలుగా సెటిల్ అయిపోయారు.

సిటీ టెంపరేచర్ జీరో! రూమ్ నంబర్ నన్ జీరో! సంధ్య బాడీ టెంపరేచర్ నన్ నన్ జీరో! నైలెక్స్ నైటీలోని ఆ బ్రైట్ బ్యూటీ- నైట్ లైట్‌లో నాటీగా కనిపిస్తోంది. అద్దంలోని అర మోడ్పు కళ్ళు బరువుగా మూసుకుపోసాగాయి. తాళం చెవి తీసుకుని తలుపు వైపు అడుగులు వేసింది. తలుపు తెరవంగానే ఎదురుగా నాథ్!

ఆనందంతో అతని మీద పడబోయింది. అతను చురుగ్గా చూసి ఎదురుగా వున్న తన రూమ్ నన్ నన్ నన్‌లోకి దారి తీశాడు.

తుపానులా అతన్ని వెంబడించి, ఉప్పెనలా అతని మీద పడి, ప్రళయంలా అతని ముఖాన్ని ముద్దులతో ముంచేసింది.

"అబ్బ! వదలవే రాకేందు వదనా" అన్నాడు నాథ్.

"ఇన్నాళ్ళికి దొరికిన నిన్ను అంత తేలిగ్గా వదుల్తానా నా శ్రీరంగనాథా!" ఆ పెదవులు- ముద్దు మాటలు వినిపిస్తున్నాయి.

"నిన్ను రమ్మంది ఇందుక్కాదే ఇందీవరాక్షీ!" అంటూ మెడ చుట్టూ బిగించిన ఆమె చేతుల్ని వదిలించుకునే ప్రయత్నం చెయ్యసాగాడు నాథ్.

ఆమె చేతులు మరింత లగించి, పళ్ళు బిగించి, లాలనగా "మరెందుకమ్మా ఏకపత్నీవ్రతా?" అంది.

"నాన్సెన్స్! నేనెప్పుడూ ఏకపత్నీవ్రతుణ్ణే! కాకపోతే- రోజూ మా ఆవిడ సాధింపు వింటూ పడుకోవడం అలవాటు కాబట్టే ఈ మూడు రోజులుగా ఆ సౌండు లేక నిద్ర పట్టడం లేదు. మధ్యాహ్నం నీ ధోరణి చూసి, నువ్వూ ఆ మాత్రం సాధించలేనా అని ఆశపడ్డాను" అన్నాడు ఓరగా సాగదీస్తూ.

పూజకే తప్ప పున్నమికి పనికిరాని తమ్మి పువ్వులాంటి నాథ్ మొహం చూసి, నిస్సహాయంగా మంచం మీద వాలిపోయింది ఉదయ సంధ్య.

కళ్ళు మూసుకుని తనని తాను తిట్టుకుంటున్న ఉదయ సంధ్య సరసన ఉత్సాహంగా ఒరిగాడు సాయ్‌కాలనాథ్! ●

## 'గాలిబ్'కు ఇచ్చే గౌరవం ఇదా?

అద్భుతమైన తన కవిత్వంతో కవితా ప్రియుల ఆదరాభిమానాలను అందుకొన్న మహాకవి గాలిబ్‌కు సుందరమైన పాలరాతి సమాధి నిర్మించడం సముచితంగానే వుంది.

అయితే, ఆ మహాకవి పాలరాతి సమాధిని పట్టించుకోకుండా, అపరిశుభ్ర వాతావరణంలో, అరాచక జీవులకు ఆటపట్టుగా వదలివేయడం ఎంతో విచారకరం. ఇది మన కవితాభిమానాని , కవుల ప ట్ల మనకు గల గౌరవాని విశృబ్దంగా ఆక్షేపిస్తున్నది.

గాలిబ్ కవిత్వం పట్ల ఆకర్షితులై ఆయన స్మృతి చిహ్నన్ని చూసేందుకు వస్తున్న విదేశీ పర్యాటకులు అక్కడి పరిసరాలను చూసి విచారం ప్రకటిస్తున్నా, ఆ సమాధికి సమీపంలోనే వున్న గాలిబ్ అకాడమి నిర్వాహకులు ఎన్నోసార్లు ఈ విషయమై ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా పరిస్థితిలో మార్పురాలేదు. నవాబ్ ఇలాహీ బక్ష్ కుమార్తె అయిన ఉమ్రావ్ బేగమ్‌ను వివాహమాడిన గాలిబ్ (అసలు పేరు అసదుల్లా ఖాన్) పాత ఢిల్లీ లోని చాందినీ చౌక్ సమీపంలోని ఒకగృహంలో నివసించాడు. ఆ రోజుల్లో నిరంతరం ఆ ఇంట కవితా సుందరి నర్తించింది, గానం చేసింది, తన సమ్మోహన రూపాన్ని ప్రదర్శించింది. అటువంటి చారిత్రక ప్రాధాన్యత వున్న గృహం కూడా నేడు శిథిలావస్థలో వుంది. ఇప్పుడా ఇంట్లో రకరకాల వ్యాపారాలు సాగుతున్నాయి. పువ్వులమ్మిన చోట కట్టెలమ్మినట్టు అన్న సామెత ప్రకారం, కవితలకు కుసుమాలు వెదజల్లిన ఆ చోట కట్టెల వ్యాపారం నడుస్తున్నది.

'దూరదర్శన్' ఇప్పుడు గాలిబ్ జీవితాన్ని సీరియల్‌గా ప్రసారం చేస్తోన్న సంగతి తెలిసిందే. అయినా, దక్షిణ ఢిల్లీలోని నిజాముద్దీన్ బస్తీలో వున్న గాలిబ్ సమాధిని కొంచెం శ్రద్ధగా, గౌరవంగా చూడాలని ఎవరూ అనుకోకపోవడం శోచనీయం.

('సన్' ఆంగ్ల పత్రికలో వెలువడిన ఒక వ్యాసం ఆధారంగా)

- కొడిమెల శ్రీరామమూర్తి